# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**
2. **అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా ప్రతి గిరిజన ప్రాంతాన్ని రహదారితో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్న మంత్రి నాదెండ్ల మనోహర్.**
3. **ఏపీయస్ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.**
4. **కేంద్ర ఎక్సైజ్ పన్నుల అవగాహనా దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

==========================

శ్రీకాకుళం జిల్లాలో అతిసార కేసులు నమోదు కావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడి క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, వ్యాధి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 32 మంది అతిసార బారిన పడగా వీరిలో 10 మంది ఇప్పటికే పూర్తిగా కోలుకున్నారని, మిగిలిన 22 మంది ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరో వైపు శ్రీకాకుళం నగరంలో అతిసార కేసులు నమోదైన ప్రాంతంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండక్కర్ ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

-------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు కొనసాగుతున్నాయి. సభ మొదలైన వెంటనే శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇస్తున్నారు. అంతకు ముందు ఇటీవల మరణించిన పలువురు మాజీ శాసనసభ్యులకు సభ సంతాపం తెలియజేసింది. ప్రజా ప్రతినిధుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు రాష్ట్ర శాసనసభ సభ్యులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు ఈ మధ్యాహ్నం ప్రారంభిస్తారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, సహా

మొత్తం 14 క్రీడాంశాల్లో ఈ నెల 26 వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

---------------------------

రాజధాని అమరావతికి అనుబంధంగా విజయవాడ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయంలో నగర అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఆయన ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, విజయవాడలోని మూడు ప్రధాన కాల్వల సుందరీకరణకు ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు నగరంలో మురుగునీటి సమస్యలను అరికట్టేందుకు సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

---------------------------

అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా ప్రతి గిరిజన ప్రాంతాన్ని రహదారితో అనుసంధానంచేసేలా చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై శాసనసభ్యులు ప్రశ్న అడగ్గా ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తరపున మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు. ఆంధ్ర – ఒడిశా సరిహద్దులోని కొఠియా గ్రామాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల కోసం 'అడవితల్లి బాట' కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 1,077 కోట్ల రూపాయలతో ఈ కార్యక్రమం అమలవుతోందని మంత్రి పేర్కొంటూ...

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ –ఏపీయస్ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య సేవలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. జిల్లా కేంద్రాల్లో 19 డిస్పెన్సరీలు, విజయవాడలో ఒక కేంద్ర ఆసుపత్రి ద్వారా ఉద్యోగుల ఆరోగ్య పథకం –ఈహెచ్ఎస్ కింద రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 వేల మంది ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

వాయిస్ ... 30 సెకన్లు

---------------------------

కల్తీ పాల ద్వారా అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందరేశ్వరి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను స్థానిక శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసుతో కలిసి ఆమె ఈరోజు పరామర్శించారు. అనంతరం పురందరేశ్వరి మాట్లాడుతూ, బాధిత ప్రాంతాల్లో అనుమానిత లక్షణాలు ఉన్నవారికి వైద్యులు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. బాధితుల వైద్య ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

---------------------------

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పురపాలక, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో మంత్రి పి. నారాయణ నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోని గ్రామాల్లో వసూలయ్యే నిధులను పంచాయతీలకు కేటాయించే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. వివిధ అనుమతుల ద్వారా వసూలయ్యే నిధుల్లో పంచాయతీలకు చెల్లించాల్సిన వాటాను నిర్ధారించాలని మంత్రి ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఆయా నిధులను గ్రామాలకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ సూచించారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో మహా కుంభాభిషేకానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ తెలిపారు. కుంభాభిషేకం మహోత్సవం ఏర్పాట్లపై విజయవాడలో ఎన్టీర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీ శా, పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్‌తో కలిసి ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శీనా నాయక్ మాట్లాడుతూ.. వచ్చే నెల 6,7,8 తేదీల్లో కుంభాభిషేకం వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

---------------------------

కేంద్ర ఎక్సైజ్ పన్నుల అవగాహనా దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. సెంట్రల్ ఎక్సైజ్, సాల్ట్ చట్టం.. 1944 ఫిబ్రవరి 24వ తేదీన రూపొందిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏటా ఈ రోజున కేంద్ర ఎక్సైజ్ పన్నుల అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. కేంద్ర ఎక్సైజ్ పన్నుల విధానాన్ని మెరుగైన రీతిలో అమలు చేసేలా ఎక్సైజ్ శాఖ ఉద్యోగులను ప్రోత్సహించేందుకు, ఈ తరహా పన్నుల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా కేంద్ర ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

---------------------------

విజయనగరం జిల్లా రాజాం పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి శత జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో చివరి రోజైన ఈరోజు పైడితల్లి అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక పుష్పాలంకరణ, క్షీరన్న భోగం నివేదన వంటివి నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చివరి రోజు కావడంతో రద్దీ మరింత పెరుగుతుందని ఈ నేపథ్యంలో వాహనాలను దారిమళ్లిస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు. స్థానిక శాసన సభ్యులు కె. మురళీమోహన్ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది తూర్పు వైపు కదులుతూ రానున్న 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశముందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పలు చోట్ల కురిసే అవకాశముందని ఎల్. నారాయణ పేర్కొంటూ...

వాయిస్...27 సెకన్లు

=====================